# సందేహాలు? సమాధానాలు!!

నిర్వహణ: **శ్రీ సముద్రాల లక్ష్మణయ్య,** తిరుపతి.

**ప్రశ్న?**

**దశావతారాలలోని వరాహస్వామి, తిరుమలలోని వరాహస్వామి ఒకరేనా?**

కె. సోమేశ్వరశర్మ, పాట్నా.

**సమాధానం**

దశావతారాలలో 'మత్స్యః కూర్మో వరాహశ్చ' అన్నట్లు వరాహావతారం మూడ వదిగా పేర్కొనబడింది. భగవంతుడు వరాహావతారం ధరించి హిరణ్యాక్షుణ్ణి సంహరించాడు. భూమిని పాతాళం నుండి ఉద్ధరించాడని పురాణాలు చెబుతున్నాయి.

శ్రీవేంకటాచల మాహాత్మ్యాన్ని వివరించే కథలు పదునొకండు పురాణాలలో లభిస్తున్నాయి. తిరుమలమీది పుష్కరిణీ తీరంలో వరాహస్వామి నెలకొని వున్నాడు. ప్రళయ కాలంలో సాగర జలాల్లో మునిగి పోయిన భూమిని ఉద్ధరించి చతుర్ముఖ బ్రహ్మను సృష్టి కార్యానికి పురికొల్పింది ఈ వరాహ స్వామి రూపంలో ఉన్న మహా విష్ణువే అని పురాణకథలు వెల్లడిస్తున్నాయి.

తనచే సముద్రంనుండి ఉద్ధరింపబడిన భూమిపై నివసించాలన్న కోరిక శ్రీవరాహస్వామికి కల్గింది. వెంటనే గరుడుణ్ణి పిలిచి వైకుంఠంలోని తన క్రీడాద్రిని పుష్కరిణితో సహా భూమికి తెమ్మని ఆ స్వామి ఆనతిచ్చాడు. గరుత్మంతుడు స్వామి ఆదేశాన్ని శిరసా వహించి 'వేంకటాద్రి' అనబడే వైకుంఠంలోని క్రీడాద్రిని తెచ్చి భూమిపై స్వర్ణముఖీ తీరంలో నెలకొల్పాడు. గరుడుడు తెచ్చిన కొండ కాబట్టి దీనికి 'గరుడాద్రి' అనే నామం కల్గింది.

వైకుంఠలోకా ద్గరుడేన విష్ణోః
క్రీడాచలో వేంకట నామధేయః
ఆనీయ చ స్వర్ణముఖీ సమీపే
సంస్థాపితో విష్ణు నివాస హేతోః

అన్న పురాణ వచనం, ఇతర పురాణాలలోని వృత్తాంతం ఇందుకు ప్రమాణాలు. 'శ్వేత వరాహకల్పే' అని సంకల్పంలో చెప్పడం కద్దు. శ్వేత వరాహ రూపధారి అయిన స్వామి ఉద్ధరించిన భూమిపై మనం ఉన్నాము. కాన ఈ కల్పానికి ఆ వ్యవహారం కల్గింది.

ఈ రీతిగా పురాణ కథలలో భూమి నుద్ధరించిన వరాహస్వామియే తిరుమలపై నెలకొన్నాడనీ, వైకుంఠంలోని క్రీడాద్రియే వేంకటాద్రి అనీ స్పష్టంగా చెప్పబడివున్నది.

**పశ్న?**

**శ్రీవారికి ఒకే సంవత్సరంలో రెండు బ్రహ్మోత్సవాలు ఎందుకు జరుపుతారు?**

ఎ.ఎస్. హరినాధబాబు, తిరుపతి.

**సమాధానం**

సాధారణంగా సంవత్సరానికి ఒకసారి శ్రవణా నక్షత్రంలో అవబృధం సమాప్తమయ్యేటట్లు శ్రీవారికి బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. కాని అధిక మాసం వచ్చిన సందర్భంలో రెండు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తాము. ఈ అధికమాసం మూడు సంవత్సరాల కొకసారి వస్తుంది. సూర్య సంక్రమణం లేని సందర్భంలో అధికమాసం వస్తుంది అందువల్ల అధికమాసం వచ్చిన సందర్భంలో రెండు బ్రహ్మోత్సవాలు నిర్వహించడం సంప్రదాయమయింది.

మొదటి బ్రహ్మోత్సవం భాద్రపదంలోనూ, రెండవ బ్రహ్మోత్సవం

ఆశ్వయుజంలోనూ నిర్వహింప బడుతాయి.

**ప్రశ్న?**

**శ్రీపద్మావతి అమ్మవారు తిరుచానూరులో ఎందుకు వెలసింది? తిరుమలలో స్వామి చెంత ఎందుకు లేదు?**

ఎన్. నారాయణ, వెంకటాపురం.

**సమాధానం**

పద్మావతీదేవి శ్రీ లక్ష్మీదేవి యొక్క మారు రూపమే. ఆమె విష్ణు వక్షః స్థలంలో సదా వుంటుంది. ఆమె నిత్యానపాయిని, అనగా ఎప్పుడూ శ్రీ మహావిష్ణువును వదలి వుండదు.

ఇక తిరుచానూరులో అమ్మ వారునెలకొనడానికి కారణమే మనగా- పూర్వం ఒకసారి దుర్వాస మహర్షి శాపంవల్ల విష్ణు దేవుని ప్రియపత్ని అయిన లక్ష్మి సురాలయం నుండి భూమికి దిగి వచ్చింది. తిరుచా నూరులోని పద్మసరోవరతీరం చేరింది. అక్కడ తపస్సు చేసింది. నాటి నుండి ఆ దేవికి ఆ సరస్తీరం నెలవయింది.

వైకుంఠంలో భృగుమహర్షి కాలి తాకిడితో కోపించిన లక్ష్మి వైకుంఠం విడిచి భూమికి వచ్చిందన్న పురాణ గాథను కూడా ఇక్కడ అనుసంధించు కోవాలి. మహా విష్ణువు ఆమెను వెద కుతూ భూలోకానికి వచ్చాడు. ఆకాశ వాణి ఆయనకు ఒక పద్మ సరోవరం నిర్మించమని సూచించింది. ఆ సూచన ననుసరించి ఆ దేవుడు అక్కడ పద్మ సరస్సును నిర్మించాడు. లక్ష్మి నారా ధించాడు. లక్ష్మి ప్రత్యక్షమయింది. స్వామికి కలువ పూలమాలను సమర్పిం చింది. ''లసల్లక్ష్మీ కరాంభోజ దత్త కల్హారక స్రజే'' అన్న శ్రీ వేంకటేశ్వరా ష్టోత్తర శతనామా వళిలోని ఒక నామం ఈ వృత్తాంతాన్నే తెలియ జేస్తున్నది.

అప్పటినుండి ఆ దేవి తిరుచా నూరులో పద్మసరోవర తీరంలో పద్మావతీ రూపంలో నెలకొని వున్నది. మానవుల వలె ఒకచోట ఉన్న దేవతలు మరొక చోట ఉండజాలరని భావించ రాదు. వీరు సిద్ధ సంకల్పులు. ఎన్ని చోట్ల నైనా, ఎన్ని రూపా లతో నైనా ఉండగలరు.

అందువల్ల పద్మావతీ రూపంలో వున్న శ్రీమహాలక్ష్మి తిరుచానూరులో నెల కొని వుండడంలో ఆశ్చర్యం లేదు. విష్ణు వక్షః స్థలంలోనూ ఆమె సదా వుంటుంది.

**పశ్న?**

**సనకసనందనాదులు ఎవరు? వివరాలు తెల్పండి?**

బి. రేఖ, తిరుపతి.

సమాధానం

సనకుడు, సనందనుడు, సనత్కుమారుడు, సనత్సుజాతుడు అనే నలుగురు సనక సనందనులుగా ప్రసిద్ధి పొందారు. వీరిని సత్త్వ గరిష్ఠు లైన మునులుగా భాగవతం వర్ణించింది వీరు బ్రహ్మ మానసపుత్రులు.

బ్రహ్మ సృష్టి కార్యానికి ఉపక్ర మించి మోహం, క్రోధం, భయం మొదలైన అవిద్యాలక్షణాలతో కూడిన ప్రాణులను మొదట సృష్టించాడు. అందలి దోషం గుర్తించి పశ్చాత్తాపం చెందాడు. తరువాత భగవంతుణ్ణి ధ్యానించి ఆ ధ్యానబలంతో పరమ పావనులైన సనకాదులను సృష్టించాడు తపఃకాలంలో బ్రహ్మ 'సన' అని పల్కడం వల్ల వారు సనకాదులయ్యారు. వీరు సదా కౌమార దశలోనే వుంటారు.

బ్రహ్మదేవుడు సనకాదులను సంతానం కని తన సృష్టి కార్యానికి సహకరించవలసినది అని అర్థించాడు. అందుకు వారు బ్రహ్మను చూచి అపహాసం చేశారు. భగవత్పరాయణు లైన వారికి సంసార సంబంధం నచ్చ లేదు. బ్రహ్మ మాటలకు ప్రతికూల మైన మాటలు పలికారు. వారు జీవన్ముక్తులై లోకమంతటా సంచరించే వారు.

వైకుంఠంలో తమను అడ్డగించిన జయ విజయులనే ద్వారపాలకులను వీరు కామక్రోధాది శత్రువుల బాధలకు లోనయ్యేటట్లు పుట్టండి అని శపించారు. అందు వల్లనే జయ విజయులు హిరణ్యాక్షుడు, హిరణ్య కశిపుడు మొదలైన రక్కసులుగా జన్మించారు.

మహా భారతంలో ధృతరాష్ట్రునికి సనత్సుజాతుడు బోధించిన వేదాంత తత్త్వం 'సనత్సుజాతీయం' అనే పేర ప్రసిద్ధమయింది.